# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం। 12। జనవరి। 2025






**చీనీ టన్ను రూ. 17 వేలు**
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



**టమాట కిలో రూ.16**
అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

**గరిష్టం/కనిష్టం**
**28.7°/16.3°**
జిల్లా పరిధిలో శనివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### జూదాలు నిర్వహిస్తే చర్యలు



ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: సంక్రాంతి పండుగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. పండుగను సందర్భంగా పేకాట, కోడి పందేలు వంటి జూదాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు వెళ్లే వారు విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులను లాకర్లలో కానీ, తమ వెంటకానీ తీసుకెళ్లి భద్రపరచుకోవాలన్నారు. పోలీసు శాఖ ప్రవేశ పెట్టిన ఎంఎల్‌హెచ్‌ఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో కోడి పందేలు, పేకాట స్థావరాలు, బెట్టింగ్ నిర్వాహకులపై ప్రత్యేక పోలీస్ టీంలు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏ ప్రాంతంలోనైనా జూద క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు..**
భోగి, మకర సంక్రాంతికి ప్రభుత్వ సెలవు ఇచ్చినందున ఈ నెల 13న సోమవారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ రత్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### పోలీసులు కొడతారని స్టేషన్ పైనుంచి దూకాడు!



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహబూబ్‌బాషా

తాడిపత్రిటౌన్: పోలీసులు కొడతారనే భయంతో పోలీస్‌స్టేషన్‌పై నుంచి ఓ వ్యక్తి కిందికి దూకేశాడు. గాయాలపాలైన అతడిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. పట్టణంలోని వరాలతోటకు చెందిన మహబూబ్ బాషాను సెల్‌ఫోన్ దొంగతనం కేసులో శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు తీసుకెళ్లారు. విచారిస్తున్న సమయంలో తనకు మూత్ర విసర్జన వస్తోందని చెప్పి మహబూబ్ బాషా బయటకు వచ్చాడు. పోలీస్‌స్టేషన్ పైకి చేరుకున్నాడు. ఈ క్రమంలోనే అరుపులు వినపడటంతో పోలీసులు వెళ్లి చూడగా.. నేలపై పడి కనిపించాడు. పోలీసులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. కాగా, పారిపోయేందుకు ప్రయత్నించి పోలీస్‌స్టేషన్‌పై నుంచి కిందకు దూకడంతో గాయాలు పాలయ్యాయని పోలీసులు చెబుతుండగా, పోలీసులు కొడతారనే భయంతో పైనుంచి దూకానని బాధితుడు తెలిపాడు.

# సం‘క్రాంతులు కరువు’

రైతు పండుగగా పిలుచుకునే సంక్రాంతి ఈసారి కళతప్పింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డీబీటీ ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరి ఏడునెలలు పూర్తయినా నయాపైసా సాయం చేయకపోవడంతో ఆనందం కరువైపోయింది. ఉన్న పథకాలకూ మంగళం పాడేశారు. పంటలు నష్టపోయినా పరిహారం అందించలేదు. పండిన అరకొర ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వకపోవడంతో అయినకాటికి దళారులకు అమ్మేసుకుంటున్నారు. పాడి పశుపోషణ, జీవాల కాపర్లు, పట్టు రైతులకు చేయూత కరువై పండుగ పూట పల్లెసీమలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి.


- జిల్లావ్యాప్తంగా పండుగ కొనుగోళ్లు అంతంతే
- 50 శాతానికి పడిపోయిన వస్త్ర వ్యాపారాలు
- పెరిగిన నిత్యావసరాల నరుకుల ధరలు
- 'సంక్షేమం' లేక ప్రజల చేతుల్లో ఆడని డబ్బులు

సాక్షి, పుట్టపర్తి: తెలుగు ప్రజల అతిపెద్ద పండుగల్లో ఒకటి సంక్రాంతి. స్కూళ్లు, కళాశాలలకు సెలవులు రావడంతో ప్రతి ఇంట్లోనూ పిల్లల హడావుడి అంతాఇంతా కాదు. ఊరంతా సందడి సందడిగా ఉంటోంది. ఇదంతా బాగానే ఉన్నా కొనుగోలు శక్తి లేక ఆడంబరాలకు దూరంగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది.



పుట్టపర్తిలో కానరాని కొనుగోలుదారులు

**నేలచూపులు..**



బంగారు, వెండి వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయి. గతంలో తులంపై ఏడాదికి గరిష్టంగా దాదాపు రూ. 5 వేలు పెరిగేది. గడిచిన పది నెలల్లోనే దాదాపు రూ.20 వేల దాకా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. కేజీ రూ.62 వేలు ఉండే వెండి నేడు రూ.లక్ష దాకా ఉంది. ఈ ప్రభావంతో వ్యాపారాలు బాగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హిందూపురంలో వ్యాపారాలు లేక వెలవెలబోతున్న వస్త్ర దుకాణాలు

**గతంలో కొండంత చేయూత..**
గత ప్రభుత్వంలో ఐదేళ్లు నవరత్నాల పథకాల కింద డీబీటీ ద్వారా చెల్లింపులు చేయడంతో బడుగు, బలహీన, నిరుపేద వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున ఆర్థిక చేయూత లభించింది. దాదాపు ప్రతి కుటుంబానికీ ఏదో ఒక పథకం వర్తించడంతో కొండంత అండగా ఉండేది. అన్ని వర్గాల ప్రజల్లోనూ కొనుగోలు శక్తి పెరిగింది. ఈ కారణంగా వ్యాపారాలూ బాగా జరిగాయి.

**'సంక్షేమం' దూరమై..**
కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు కాక తాము కష్టపడి సంపాదించినంతా పిల్లల చదువులు, కుటుంబాల నిర్వహణకే సరిపోతుండడంతో పండుగలకు ప్రత్యేకంగా ఎక్కువస్థాయిలో ఖర్చు చేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. దీనికితోడు నిత్యావసర సరుకుల నుంచి బ్రాండెడ్ వస్త్రాల దాకా అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ఈ కారణంగానే అన్ని రకాల వ్యాపారాలు ఈసారి బాగా పడిపోయాయి.

**వ్యాపారాలు కుదేల్..**
హిందూపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ.. ఇలా ప్రతి పట్టణంలో వ్యాపారాలు దెబ్బతిన్నాయి. బైక్‌ల షోరూంలకు గిరాకీ లేదు. బట్టల వ్యాపారాలకు ప్రజలు రావడం లేదు. 50 శాతం మేర వస్త్ర వ్యాపారం పడిపోయింది. ఫర్నీచర్ షాపులను పట్టించుకోవడం లేదు. పేద, మధ్య తరగతి వర్గాలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే స్థిరాస్తి రంగం కుదేలైంది. చేతిలో డబ్బులు కరువై కొనుగోలు శక్తి భారీగా పడిపోయింది.

**దారుణంగా పరిస్థితులు**



గత ఏడాదితో పోల్చితే ఈసారి టూ వీలర్ కొనుగోళ్లు దారుణంగా పడిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 4 వేల బైకులు అమ్మకాలు జరిగేవి. ఈ ఏడాది 2 వేలు కూడా అమ్మకాలు జరగలేదు. సంక్రాంతికి కొనుగోళ్లు చేసేవారే కనిపించడం లేదు.
– మల్లికార్జున, డీలర్, అనంతపురం

**గిరాకీ తగ్గింది..**



గడిచిన ఐదేళ్లలో వ్యాపారం బాగా జరిగేది. ప్రతి పండుగకు జనాల రద్దీ కనిపించేది. ఈసారి 50 శాతం మంది షాపింగ్‌కు రాలేదు. బట్టల వ్యాపారాలు భారీగా దెబ్బతిన్నాయి. కొనేవారు లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. షాపుల అద్దెలు పెరిగిపోయాయి. వ్యాపారాలు బాగా జరిగితే లాభాలు గడించి అద్దెలను కట్టవచ్చు. అయితే ప్రజల దగ్గర డబ్బుల్లేకపోవడంతో మా వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. – ధనంజయ, బట్టల వ్యాపారి, ధర్మవరం

**సందడి లేదు**



మా చుట్టుపక్కల చాలామంది ఇంట సంక్రాంతి పండుగ కళ కనిపించడం లేదు. గ్రామానికి కొత్త బంధువులు వచ్చినట్లు సందడి లేదు. ఎవరి నోట విన్నా.. ప్రజల చేతుల్లో డబ్బులు లేవని చెబుతున్నారు. వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నుంచి సహకారం లేదని సమాధానం ఇస్తున్నారు. బయట రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేసే వారు మాత్రమే సంతోషంగా ఉన్నారు. స్థానికులందరికీ సంక్రాంతి పండుగ చేదుగానే ఉందని చెప్పవచ్చు. – చెక్కిరమ్మ, ఎనుములపల్లి, పుట్టపర్తి

**మార్కెట్ పడిపోయింది**



జిల్లా వ్యాప్తంగా ఏ రంగం పరిశీలించినా నష్టాల బాటలోనే నడుస్తోంది. రియల్టీ రంగానికి ఊపు రాలేదు. బట్టల వ్యాపారాలకు గిరాకీ లేదు. వెహికల్స్ షోరూంలకు కస్టమర్లు రాలేదు. ప్రజల దగ్గర డబ్బులు ఉంటేనే వ్యాపారాలు బాగా జరుగుతాయని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. పథకాలు అమలు కావడం లేదు. కరెంటు బిల్లుల రూపంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.
– చంద్రానాయక్, మక్కాజిపల్లి తండా, పెనుకొండ మండలం

### వడ్డే ఓబన్న సేవలు చిరస్మరణీయం



వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రశాంతి నిలయం: స్వాతంత్య్రోద్యమంలో వడ్డే ఓబన్న సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ చేతన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హాజరై వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న త్యాగం భావితరాలకు ఆదర్శమన్నారు. స్వాతంత్య్రోద్యమంలో ఓబన్న ముఖ్య పాత్ర పోషించిందన్నారు. రైతులపై అధిక పన్ను విధించడాన్ని అయన వ్యతిరేకించి బ్రిటీషర్లపై పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి నిర్వహించారు. ఎస్పీ రత్న పాల్గొని ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్య్రోద్యమంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి కుడి భుజంగా ఉంటూ సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.




వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

## వెంకన్న వద్దు.. బాలయ్యే ముద్దు!

- 'డాకు మహారాజ్'పై పోలీసు ఉన్నతాధికారుల అతిప్రేమ
- విధులకు 150 మందికి పైగా ఖాకీల కేటాయింపు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సీఎం చంద్రబాబు బావమరిది, సినీ హీరో బాలకృష్ణ నటించిన ఓ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌పై పోలీసు ఉన్నతాధికారులు కనబరిచిన అత్యుత్సాహం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ కార్యక్రమం కోసం వందలాది మంది పోలీసులను రెండు రోజుల పాటు బందోబస్తు విధులకు కేటాయించిన తీరు చర్చనీయాంశమవుతోంది. అనంతపురంలో ఫంక్షన్ జరిగే ప్రాంతం వద్ద సుమారు 150 మంది పోలీసులు 9వ తేదీ రాత్రి వరకూ పని చేశారు. అయితే, తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడంతో చేసేది లేక నిర్వాహకులు సినిమా ఫంక్షన్ రద్దు చేశారు.

**తిరుమలకు వెళ్లాల్సి ఉన్నా..**
మూడు రోజుల క్రితం కుప్పం పర్యటనలో బాబు సేవలో తరించిన పోలీసులు... అదే రీతిలో ఇక్కడ బాలకృష్ణ సేవలో తరించేందుకు తహతహలాడారు. వాస్తవంగా ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు తిరుమలలో బందోబస్తు విధులు నిర్వర్తించేందుకు అనంతపురం పోలీసులు వెళ్లేవారు. తిరుమలలో జిల్లా పోలీసులు సమర్థవంతంగా పని చేసేవారనే పేరుంది. కానీ ఈసారి మాత్రం బాలకృష్ణ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఉండటంతో ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే తిరుపతిలో తొక్కిసలాట దుర్ఘటన చోటుచేసుకోవడం, పోలీసుల నిర్లక్ష్యంతోనే అమాయక భక్తులు ప్రాణాలు కోల్పోయారని వార్తలు వచ్చిన క్రమంలో జిల్లా పోలీసుల తీరు కూడా ఇప్పుడు చర్చనీయాంశమైంది. స్వయాన ఎస్పీ జగదీష్ వందలాది మంది పోలీసులను ఇక్కడే బాలకృష్ణ సినిమా డ్యూటీకి వేయడంతో తిరుమల బందోబస్తుకు వెళ్లలేక పోయామని కిందిస్థాయి అధికారులు చెబుతున్నారు. 'గత ఏడాది తిరుమలలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా బందోబస్తు డ్యూటీలను పకడ్బందీగా నిర్వర్తించాం. ఈ ఏడాది సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ వద్ద విధులు కేటాయించడంతో ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చింది' అని ఓ ఏఆర్ ఎస్ఐ చెప్పడం గమనార్హం.



డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

## టికెట్లు అధిక ధరలకు విక్రయిస్తే బస్సులు సీజ్

- డీటీసీ వీర్రాజు హెచ్చరిక

అనంతపురం సెంట్రల్: సంక్రాంతి పండుగ సందర్భంగా అధిక ధరలకు బస్సు టికెట్లు విక్రయిస్తే సంబంధిత ట్రావెల్స్ బస్సులను సీజ్ చేస్తామని ఉప రవాణా కమిషనర్ వీర్రాజు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ నెల 18 వరకూ స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి అన్ని ప్రైవేటు ట్రావెల్స్‌బస్సులను తనిఖీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 8 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అధిక ధరలు వసూలు చేస్తే వెంటనే రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని డీటీసీ విజ్ఞప్తి చేశారు.

**29న వాహనాల వేలం..**
రవాణాశాఖ కార్యాలయంలో సీజ్ చేసి ఉంచిన వాహనాలను ఈనెల 29న వేలం వేస్తున్నట్లు డీటీసీ వీర్రాజు తెలిపారు. సుమారు 200 వాహనాలు ఉన్నట్లు పేర్కొన్నారు. వాహన యజమానులు, ఫైనాన్షియర్లు తగిన ఆధారాలతో ఈనెల 27లోపు రవాణాశాఖ కార్యాలయానికి వచ్చి, అపరాధ రుసుం చెల్లించి వాహనాలను తీసుకెళ్లాలని, లేదంటే నిబంధనల మేరకు వాహనాలను వేలం వేస్తామని హెచ్చరించారు.

**గడువులోపు ట్యాక్సులు చెల్లించాలి..**
రవాణా సేవలను 'వాహన్' పోర్టల్‌లోకి మార్చిన తర్వాత మొదటి త్రైమాసిక పన్నులు కడుతున్న వాహన యజమానులు ఈ నెలాఖరు వరకూ వేచి ఉండకుండా ముందుగానే చెల్లించాలని డీటీసీ వీర్రాజు తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా రవాణాశాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకూ సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్



సత్యసాయి విద్యార్థుల బైక్ రైడింగ్ విన్యాసాలు



విద్యార్థుల డ్రాగన్ సాంస్కృతిక ప్రదర్శన

## అబ్బురం.. అద్భుతం

- వేడుకగా సత్యసాయి విద్యా సంస్థల 43వ క్రీడా సాంస్కృతిక సమ్మేళనం

ప్రశాంతి నిలయం: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే ప్రదర్శనలు, ఒళ్లు గగుర్పొడిచే సాహస విన్యాసాల సమాహారంగా సాగిన సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళన సంబరం అంబరమంటింది. శనివారం పుట్టపర్తిలోని సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో 43వ సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనం వేలాది మంది వీక్షకుల నడుమ నిర్వహించారు. ఉదయం ప్రశాంతి నిలయంలోని సత్యసాయి యజుర్ మందిరం నుంచి సత్యసాయి చిత్రపటాన్ని బ్రాస్‌బ్యాండ్ వాయిద్యం నడుమ హిల్ వ్యూ స్టేడియంలోని శాంతి వేదిక వద్దకు తీసుకొచ్చి అక్కడ ఏర్పాటు చేసిన సత్యసాయి సింహాసనం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రస్తావిస్తూ విద్యార్థులు ప్రత్యేక బ్యానర్ ప్రదర్శించారు. ప్రశాంతి నిలయం, బృందావన్, అనంతపురం, నందగిరి క్యాంపస్‌తో పాటు సత్యసాయి వైద్య సంస్థలకు చెందిన నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్సెస్, సత్యసాయి మహిళా విద్యా సంస్థల విద్యార్థులు సత్యసాయి జగతికి చాటిన మానవతా విలువలను ప్రదర్శిస్తూ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. సత్యసాయి విద్యా సంస్థల పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ క్రీడా జ్యోతి వెలిగించారు. తొలుత జగతిపై దైవస్వరూపులు ప్రదర్శించిన దశావతారాలను ప్రదర్శిస్తూ రామాయణ, భాగవతాది పురాణ గాథలను వివరిస్తూ కలియుగంలో అవతరించిన దైవస్వరూపుడు సత్యసాయి అని సందేశాన్నిచారు. వంద అడుగుల ఎత్తయిన క్రేన్‌కు అమర్చిన ఇనుప ఊచలపై విన్యాసాలను ప్రదర్శిస్తూ సత్యసాయి శత జయంతి వేడుకల రూపాన్ని ప్రతిబింబించారు. బెలూన్ జంపింగ్, హైజంప్, లాంగ్ జంప్, బంగీ జంప్, విన్యాసాలను అత్యద్భుతంగా ప్రదర్శించారు. పరమశివుడు భక్త బృందం లయబద్ధంగా నాట్య విన్యాసాల ప్రదర్శన, ఆధునిక, సంప్రదాయ నృత్య ప్రదర్శనల సమ్మేళనంతో ఆకట్టుకుంది. కావడి నృత్యంతో చిన్నారులు మైమరిపించారు. ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు బైక్ రైడింగ్‌తో ఒళ్లు గగుర్పొడిచే సాహస విన్యాసాలను ప్రదర్శించి ఔరా అనిపించారు. బైక్‌పై గిటారు వాయించడం, అగ్ని కీలల మధ్యలోంచి బైక్ రైడింగ్, బైక్‌పై ఐదుగురు ఒకే సారి ప్రయాణించే పలు సాహస విన్యాసాలు ఉత్కంఠ రేపాయి. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలను తిలకిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



సనాతన భారతీయ యోగా విశిష్టతపై ప్రదర్శన



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు




కలియుగ అవతారి సత్యసాయి అన్న సందేశాన్నిస్తూ దశావతార ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



జంపింగ్ విన్యాసం



భాగవతంలో శ్రీకృష్ణ అవతార వైభవం చాటుతూ...

## క్లుప్తంగా

### ఖాద్రీ ఆలయానికి పోటెత్తిన భక్తులు



క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

**కదిరి టౌన్:** ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. త్రయోదశి కలసి వచ్చిన శనివారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### 7 కిలోల కణతి తొలగింపు





కోలుకుంటున్న రోగితో వైద్య బృందం (ఇన్‌సెట్) తొలగించిన కణతి

**కదిరి టౌన్:** స్థానిక రేణుక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి, ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి నిర్వాహకులు శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నల్లచెరువు మండలం తవళం మర్రి గ్రామం దిగువపల్లికి చెందిన మంజుల గత ఆరేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఈ నెల 8న తమ ఆస్పత్రికి వచ్చిందన్నారు. పొట్ట వాపుతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షల అనంతరం కడుపులో కణతి ఉన్నట్లుగా గుర్తించామన్నారు. దీంతో కుటుంబసభ్యుల అనుమతితో ఆమెకు డాక్టర్లు రేణుకారెడ్డి, రిషితారెడ్డి, విజయబాబు, భాస్కర్‌నాయక్ ఆపరేషన్ చేసి 7 కిలోల కణతిని తొలగించారన్నారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నట్లు పేర్కొన్నారు.

### ఒకే వరుసలో నాలుగు వాహనాలు ఢీ



నుజ్జునుజ్జయిన కారు

**పెనుకొండ రూరల్:** ఒకే మార్గంలో ప్రయాణిస్తున్న నాలుగు వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళుతున్న కారు... పెనుకొండ మండలం గుట్టూరు వై జంక్షన్ వద్దకు చేరుకోగానే జాతీయ రహదారిపై స్పీడు బ్రేకర్ల వద్ద డ్రైవర్ వేగాన్ని నియంత్రించాడు. అదే సమయంలో వెనుకనే ఉన్న ఓ ట్రావెల్ బస్సు వేగంగా కారును ఢీకొంది. కారు వెళ్లి ఎదురుగా ఉన్న ఐచర్ వాహనాన్ని... ఆ ఐచర్ తన ముందు ఉన్న లారీని ఢీకొన్నాయి. ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న రవీంద్ర, నందిని, కాశీవిశ్వనాథ్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను వెలికి తీసి పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఎందుకీ గోప్యత?



మద్యం అక్రమ రవాణాదారుల ఆటకట్టించడంతో పాటు కేసు వివరాలను ఎప్పటికప్పుడు బయట పెట్టాల్సిన ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు ఎందుకో గోప్యత పాటిస్తున్నారు. హిందూపురంలో భారీగా మహారాష్ట్ర మద్యం పట్టుబడినట్లు ప్రచారం జరుగుతున్నా వారు మాత్రం నోరుమెదపడం లేదు. బాలయ్య పీఏల ఒత్తిడితోనే కేసును పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.



- మద్యం రహస్య స్థావరాలపై ఎక్సైజ్ విజిలెన్స్
- హిందూపురం వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు
- రెండు లారీల మహారాష్ట్ర మద్యం పట్టివేత!
- విచారణ పేరుతో గోప్యంగా ఉంచిన ఎక్సైజ్ అధికారులు
- బాలయ్య పీఏల ఒత్తిడితో కేసు పక్కదారి !

**సాక్షి, పుట్టపర్తి:** హిందూపురం నియోజకవర్గంలోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు పరిసరాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నాలుగు రోజులుగా జల్లెడ పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో మద్యం దాచిన రహస్య స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నారు. అయితే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో పట్టుబడిన అక్రమ మద్యంపై అంచనా అంతు చిక్కడం లేదు. రెండు లారీలకు పైగా మహారాష్ట్ర మద్యం పట్టుబడినట్లు జోరుగా ప్రచారం సాగుతున్నా... దీనిపై ఇంతవరకూ ఎక్సైజ్ పోలీసులు ఎలాంటి సమాచారం బయటికి చెప్పడం లేదు. విచారణ జరుగుతోందని.. ఒకట్రెండు రోజుల్లో సమగ్ర వివరాలతో వెల్లడిస్తామంటూ మాట దాటేస్తున్నారు. దీంతో కేసును పక్కదోవ పట్టిస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏల కనుసన్నల్లోనే అక్రమ మద్యం దందా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఎంత మద్యం చూపించాలి. ఎవరి అరెస్టు చూపాలి. అసలు చూపాలా? వద్దా? అనే దానిపై చర్చిస్తున్నట్లు సమాచారం. మంగళవారం నుంచి ఎడతెగని దాడులు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా.. ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం బయటికి చెప్పకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

#### పక్కదోవ పట్టించేందుకే..?

ఎక్సైజ్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసిన విషయం బయటికి చెప్పకుండా విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారు. పట్టుబడిన మద్యం వెనుక కొందరు టీడీపీ నేతలు ఉండటంతో కేసును పక్కదోవ పట్టించేందుకే ఆలస్యం చేస్తున్నారని సమాచారం. టీడీపీకి చెందిన బేవనహళ్లి ఆనంద్‌తో పాటు పట్టుబడిన మద్యం స్థావరాలు.. మరో నేత జేపీఎస్‌కు చెందినవిగా తేలింది. దీంతో ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు రంగంలోకి దిగి కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.



#### రహస్య స్థావరాల ఛేదింపు..

హిందూపురం శివారు ప్రాంతాలు, లేపాక్షి మండల పరిధిలోని కర్ణాటక సరిహద్దు, చిలమత్తూరు మండలంలోని పలు గ్రామాల చివరన ఉన్న రహస్య స్థావరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సుమారు 40 మంది సిబ్బందితో దాడులు చేస్తున్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా ముందుగా స్థావరాలు కనిపెట్టి.. ఆ తర్వాత దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిసింది. అయితే కొన్ని స్థావరాలను మాత్రమే ఛేదించినట్లు సమాచారం. ముందస్తు సమాచారంతో కొన్ని స్థావరాల్లో సరుకు పక్కకు తరలించినట్లు తెలిసింది. దీంతో దాచిన సరుకు ఎక్కడ ఉందో అధికారులు కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.

#### పోలీసుల అదుపులో 11 మంది?

హిందూపురం చుట్టుపక్కల ఇటీవల పట్టుబడిన మహారాష్ట్ర మద్యం కేసులో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఏపీ లేబుళ్ల అతికించి మహారాష్ట్ర నుంచి హిందూపురానికి దిగుమతి చేసుకున్న మద్యాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులోకి తరలిస్తుండగా పక్కా సమాచారంతో అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న మంగేశ్, పుల్లారెడ్డి, బాచి తదితరులు కూడా మహారాష్ట్ర మద్యం కేసులో ఉన్నట్లు సమాచారం. అరెస్టుల భయంతో ఎవరికి వారు అజ్ఞాతంలోకి వెళ్లారు.

#### ఎక్సైజ్ సీఐపై వేటు



హిందూపురం పరిసరాల్లో ఇటీవల మహారాష్ట్ర మద్యం భారీగా పట్టుబడింది. ఈ అంశం ఇప్పటి వరకూ బయటకు పొక్కలేదు. కూటమి నేతల ఒత్తిడితో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆయనపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ కనుసన్నల్లో మద్యం దందా జరుగుతున్నప్పటికీ.. మూడునెలలుగా స్థానిక ఎక్సైజ్ స్టేషన్ నుంచి చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించారనే కారణంగా సీఐ లక్ష్మీదుర్గయ్యను విజయవాడకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొడికొండ చెక్‌పోస్టు ఇన్‌స్పెక్టర్ రామమోహన్‌కు హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ సీఐగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## నిజాయితీ చాటుకున్న కండక్టర్

**కదిరి అర్బన్:** బస్సులో పోగొట్టుకున్న సెల్‌ఫోన్, పర్సును సురక్షితంగా ప్రయాణికుడికి చేర్చి ఓ కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నారు. వివరాలు... శనివారం ఉదయం కదిరి బస్టాండ్ నుంచి హిందూపురానికి వెళుతున్న బస్సులో ప్రసాద్ అనే ప్రయాణికుడు ఎక్కి పాలసముద్రం సమీపంలోని రాచపల్లి వద్ద దిగేశాడు. ఆ సమయంలో బస్సులోనే తన సెల్‌ఫోన్, పర్సు పోగొట్టుకున్నాడు. కాసేపటి తర్వాత ఇతరుల తన నంబర్‌కు కాల్ చేయడంతో సెల్‌ఫోన్ రింగ్ అవుతుండడం గమనించిన కండక్టర్ లక్ష్మీనరసమ్మ తీసుకుని సమాధానమిచ్చారు. విషయం తెలుసుకున్న అనంతరం పర్సు, సెల్‌ఫోన్‌ను భద్రపరిచి తిరుగు ప్రయాణంలో ప్రయాణికుడిని స్టేజ్ వద్దకు రప్పించుకుని అప్పగించారు. పర్సులో రూ.15 వేలు నగదు, ఏటీఎం కార్డు, ఆధార్ కార్డు భద్రంగా ఉన్నాయి. ఈ సందర్భంగా కండక్టర్ లక్ష్మీనరసమ్మకు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



పర్సును అందజేస్తున్న కండక్టర్ లక్ష్మీ నరసమ్మ

## నలుగురు మైనర్ల మిస్సింగ్

- రెండు గంటల్లోనే ఆచూకీ గుర్తింపు

**డి హీరేహాళ్(రాయదుర్గం):** ఇంట్లో తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశానికి లోనైన నలుగురు మైనర్లు ఇల్లు విడిచి వెళ్లిపోయారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వీరిలో ఓ బాలిక ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు రెండు గంటల్లోనే చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు... డి.హీరేహాళ్ మంలడం జాజరకల్లు గ్రామానికి చెందిన నలుగురు మైనర్లు అల్లరి చేస్తుంటే శుక్రవారం తల్లిదండ్రులు మందలించారు. దీంతో అదే రోజు రాత్రి 2 గంటల సమయంలో ఓ బాలిక, నలుగురు బాలురు ఇల్లు విడిచి వెళ్లిపోయారు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో దిగాలు చెందారు. విషయాన్ని డి.హీరేహాల్ పోలీసులకు శనివారం ఉదయం 11.30 గంటలకు జాజరకల్లుకు చెందిన అమరేష్ చేరవేశాడు. దీంతో అప్రమత్తమైన ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి, సీఐ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను రంగంలో దించారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీల ద్వారా మైనర్లు కర్ణాటకలోని ఉలిగి గ్రామంలో ఉన్నట్లుగా గుర్తించి అక్కడకు ఓ బృందాన్ని పంపారు. ఆలయ పరిసరాల్లో దిగాలుగా కూర్చొన్న నలుగురు పిల్లలను ఓదార్చి డి.హీరేహాళ్ పీఎస్‌కు పిలుచుకొచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ అనంతరం పిల్లలను అప్పగించారు. సమాచారం అందుకున్న కేవలం రెండు గంటల్లోనే మిస్సింగ్ కేసులో మిస్టరీని ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ రవిబాబు ప్రత్యేకంగా అభినందించారు.

### వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక..

## రైతు బలవన్మరణం



రైతు నగేష్ (ఫైల్)

**తాడిమర్రి:** వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన కూనప్పగారి నగేష్ (41), లక్ష్మీదేవి దంపతులకు సంతానం లేదు. ఇద్దరూ తమకున్న ఐదు ఎకరాల్లో అరటి తోట సాగు చేశారు. పంట పెట్టుబడులకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశారు. అయితే పంట సక్రమంగా పండక పోవడంతో అప్పులు తీర్చలేక ఇద్దరూ వ్యవసాయ కూలి పనులకు పోవడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.25 లక్షలకు చేరుకుంది. తమ అప్పు తీర్చాలంటూ ఇటీవల వడ్డీ వ్యాపారులు తరచూ గొడవ పడుతుండడంతో మనస్తాపం చెందిన రైతు శనివారం మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో తన ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగి ఖాళీ డబ్బాను బయటకు విసిరేశాడు. అప్పటి వరకూ పక్కింటి వారితో మాట్లాడుతున్న భార్య డబ్బా శబ్దానికి అప్రమత్తమై ఇంట్లోకి వెళ్లింది. విలవిల్లాడుతున్న భర్తను గమనించి వెంటనే బంధువుల సాయంతో ఆస్పత్రికి తరలించేలోపు నగేష్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

#### యువకుడి ఆత్మహత్య

**పుట్టపర్తి టౌన్:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న నరసింహులు, శాంతమ్మ దంపతుల కుమారుడు నరేంద్ర(27) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఎస్సీ కాలనీకి చెందిన నరసింహులు మున్సిపాలిటీలో స్వీపర్‌గా, శాంతమ్మ ఎనుములపల్లి ప్రభుత్వాస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. తమ ఏకైక కుమారుడు నరేంద్రకు కొంత కాలం క్రితం పెళ్లి చేశారు. అయితే దంపతుల మధ్య మనస్పర్థలు చెలరేగి నరేంద్రకు దూరంగా భార్య ఉంటోంది. ఇటీవల కాలు విరిగి ఇంటి పట్టునే ఉన్న నరేంద్ర... శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సీఐ సునీత అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## 14న కల్లూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**గార్లదిన్నె:** గార్లదిన్నె మండలంలోని పాత కల్లూరులో ఈ నెల 14న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు శనివారం వెల్లడించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం యువకులకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 13వ తేదీలోపు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేత జట్లకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. పూర్తి వివరాలకు 79816 46683, 63026 55150లో సంప్రదించవచ్చు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



**హిందూపురం అర్బన్:** స్థానిక చౌడేశ్వరి కాలనీలో శుక్రవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చాడు? మృతికి గల కారణాలేమిటి? అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు కేసు నమోదు చేసిన సీఐ రాజగోపాలనాయుడు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 94407 96844కు సంప్రదించాలని కోరారు.

### ద్విచక్ర వాహనం ఢీకొని రైతు మృతి



మృతుడు చిత్తప్ప

**రొళ్ల:** ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం చిగమతిఘట్ట గ్రామానికి చెందిన గొల్ల చిత్తప్ప(54)కు భార్య భాగ్యమ్మ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె సుమలతకు మహేష్ అనే యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. వ్యవసాయంతో పాటు కూలి పనులతో చిత్తప్ప దంపతులు జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాము సాగు చేసిన పంట పొలం వద్దకు రోజూ రాత్రి సమయంలో చిత్తప్ప కాపలాకు వెళ్లి మరుసటి రోజు ఉదయం ఇంటికి చేరుకునేవాడు. రోజువారీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పొలం వద్దకు వెళ్లిన ఆయన శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో అగళి మండలం మధూడి నుంచి అమరాపురం మండలానికి వెళ్లే ప్రధాన రోడ్డు పైకి చేరుకోగానే ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న అల్లుడు మహేష్ ఢీకొన్నాడు. ఘటనలో కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్న చిత్తప్పను కుటుంబసభ్యుల సాయంతో వెంటనే మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### కారు ఢీ - కియా ఉద్యోగి దుర్మరణం



మృతుడు మారుతి

**ధర్మవరం రూరల్:** కారు ఢీకొన్న ఘటనలో కియా ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం సీతారాంపల్లికి చెందిన కుమ్మరి మారుతి (42) కియా పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం రాత్రి కనగానపల్లి మండలం మామిళ్లపల్లి మీదుగా ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. సీతారాంపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### మైనారిటీ నేతపై దాడి

**హిందూపురం అర్బన్:** స్థానిక కోట ప్రాంతంలో నివాసమున్న టీడీపీ మైనారిటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీఎస్ హిదాయత్‌పై శనివారం సాయంత్రం కొందరు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని ఇందిరానగర్‌లో ఉన్న స్థలం విషయంగా హిదాయత్, మున్సిపాలిటీ మధ్య వివాదం నెలకొంది. ఆ స్థలం విషయంలోనే హిదాయత్, మరికొంత మంది మధ్య కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన తోట వద్ద ఉన్న హిదాయత్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కత్తిదాడి చేసి, ఉడాయించారు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు వెంటనే ఆయనను జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న సీఐ అబ్దుల్‌కరీం.. ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



## సాంకేతిక విద్యలో నూతన బ్రాంచ్‌లు

- జేఎన్‌టీయూ(ఏ)లో అమలుకు కసరత్తు
- క్యాంపస్ కళాశాలలో ఇప్పటికే ఆరు బ్రాంచ్‌లు
- కంప్యూటర్ సైన్స్‌లో అదనంగా ఏఐ ఏర్పాటు
- అడ్మిషన్లు పెంచుకునేలా కార్యాచరణ



జేఎన్‌టీయూ(ఏ) కళాశాల

**అనంతపురం:** సాంకేతిక విద్యలో నూతన కోర్సులను జేఎన్‌టీయూఏ అందుబాటులోకి తీసుకురానుంది. ఈ క్రమంలో నూతన బ్రాంచ్‌ల అమలుకు కసరత్తు మొదలైంది. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలకు దీటుగా అడ్మిషన్లు పెంచుకునేలా గత ప్రభుత్వ హయాంలోనే జేఎన్‌టీయూఏలో కార్యాచరణ మొదలైంది. జేఎన్‌టీయూఏ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగంలో ఆరు బ్రాంచ్‌లు ఉన్నాయి. దీనికి అదనంగా కంప్యూటర్ సైన్సెస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు పాలకమండలి ఆమోదం తెలిపింది. పాలనాపరమైన అనుమతులు వచ్చిన వెంటనే కొత్త కోర్సు అమల్లోకి రానుంది. దీంతో జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ బ్రాంచుల్లో మొత్తం ఏడు కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. సివిల్, మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, కెమికల్, కంప్యూటర్ సైన్సెస్, కంప్యూటర్ సైన్సెస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల్లో గణనీయంగా అడ్మిషన్లు పెరిగే అవకాశముంది.

#### నూతనంగా బీబీఏ కోర్సు..

జేఎన్‌టీయూఏలోని ఎంబీఏ కళాశాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఏపీ ఐసెట్‌లో టాప్ ర్యాంకర్లకు మాత్రమే ఇక్కడ చోటు దక్కుతోంది. టాపర్లందరూ ఈ కళాశాలనే ఎంపిక చేసుకుంటుంటారు. ఇక్కడ ఎంబీఏ పూర్తయిన తక్షణమే ఉద్యోగావకాశాలు దక్కుతున్నాయి. దీనికి తోడు కళాశాల బ్రాండ్ ఇమేజ్ కూడా మరో కారణమైంది. ఈ నేపథ్యంలో డిగ్రీ స్థాయిలోనే మేనేజ్‌మెంట్ కోర్సు అమలు చేయాలని నిర్ణయించి బీబీఏ కోర్సును అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకు సంబంధించి కూడా పాలకమండలి ఆమోదం తెలిపింది. పాలనాపరమైన అనుమతులు వస్తే బీబీఏ కోర్సు అందుబాటులోకి రానుంది.

#### అందుబాటులోకి 'స్వయం' కోర్సులు..

సాంకేతికత పెరిగిన ప్రస్తుత రోజుల్లో వర్చువల్ లెర్నింగ్‌కు విస్తృత అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. మన ఇంటి నుంచే... మనమున్న చోటు నుంచే.. మనకు నచ్చిన కోర్సును పూర్తి చేసే అవకాశం ఉంది. ఇది కూడా పూర్తి ఉచితంగానే కావడం విశేషం. అంతేకాకుండా ఈ కోర్సులకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు ఉండడం గమనార్హం. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో స్వయం వేదిక (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ మైండ్స్) విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు సంబంధించి 'స్వయం' ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పోర్టల్‌నూ ప్రారంభించింది. దీని ద్వారా ఇంజినీరింగ్ టెక్నాలజీ మొదలు హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, బిజినెస్, లా వంటి అనేక విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేయవచ్చు. దేశంలోని టాప్ ఇనిస్టిట్యూట్ల ఫ్యాకల్టీలు రూపొందించిన సబ్జెక్టులతో బోధన సాగుతుంది.

#### ఎంటెక్‌లో టన్నెల్, బ్రిడ్జెస్ కోర్సుకు ఆదరణ..

దేశంలోనే తొలిసారిగా ఎంటెక్‌లో టన్నెల్, బ్రిడ్జెస్ కోర్సును జేఎన్‌టీయూఏ రెండేళ్ల క్రితమే ప్రవేశపెట్టారు. టన్నెల్స్, బ్రిడ్జి నిర్మాణంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారి కొరత అధికంగా ఉంది. ఈ క్రమంలో భారత ప్రభుత్వ రోడ్డు, రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ఎంటెక్‌లో టన్నెల్, బ్రిడ్జెస్ కోర్సు నిర్వహించేందుకు ఆర్థిక చేయూత ప్రకటించింది. తొలి ఐదేళ్లు ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సు నిర్వహణకు రూ.4 కోట్ల నిధులూ మంజూరు చేసింది. కోర్సు చేస్తున్న వారు ఇప్పటికే ఇంటర్న్‌షిప్‌లో ఉండడం విశేషం.